ఇందిరమ్మకు ధరల సెగ!

- భారీగా పెరిగిన ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు
- ఇళ్ల నిర్మాణానికి జంకుతున్న లబ్ధిదారులు


డబ్బులు మంజూరు కాక గంగాసముందర్‌లో నిలిచిన ఇందిరమ్మ ఇళ్లు

డొంకేశ్వర్ : ఇందిరమ్మ ఇళ్లకు ధరల సెగ తగిలింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు భారీగా పెరిగాయి. మార్కెట్‌లో ఇసుక టన్నుకు రూ.1,800, సిమెంట్ బస్తా రూ.330, ఐరన్ కిలో రూ.60 ఉంది. దీంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారు. బేస్‌మిట్ వరకే రూ.5లక్షలు అవుతున్నాయని వాపోతున్నారు. తక్కువ ధరకే సిమెంట్, ఐరన్, ఇసుకను అందిస్తామని చెప్పిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో లబ్ధిదారులపై తీవ్ర భారం పడుతోంది. బిల్లులు కూడా రాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. డొంకేశ్వర్ మండలంలో మొత్తం పదమూడు గ్రామాలు ఉండగా 295 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో కేవలం 54 మంది మాత్రమే ముందుకు వచ్చి ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఇందులో మండల కేంద్రంలో ఒక్కరికి మాత్రమే రూ. ఒక లక్ష నిధులు మాత్రమే జమ అయ్యాయి. మిగతా వారు ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. డబ్బులు రాకపోవడంతో చాలా మంది ఇళ్ల నిర్మాణాలను పిల్లర్ల దశలోనే నిలిపివేశారు. ఇటు పర్యవేక్షణ చేసి నిధుల మంజూరుకు ఆమోదం తెలపాల్సిన గృహ నిర్మాణ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదు. ఏఈగా ఉన్న మహిళా అధికారి ఉద్యోగానికి రాజీనామా చేయడంతో మండలంలో ఇందిరమ్మ ఇళ్లను పట్టించుకునే వారు కరువైయ్యారు. లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శులను నిలదీస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో ఏ మాత్రం చొరవ తీసుకోవడం లేదు.

పెరిగిన ధరలతో ఇళ్లు కట్టలేం



ఇందిరమ్మ ఇళ్లకు అవసరమయ్యే ఇసుక, సిమెంట్, ఐరన్ తక్కువ ధరకు ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సొంతంగా డబ్బులు వెచ్చించి పిల్లర్ల దాక ఇంటి నిర్మాణం చేశాను. సిమెంట్, ఐరన్ ధరలు చాలా పెరిగాయి. ప్రభుత్వం వీటిని తక్కువ ధరకు ఇప్పించకపోతే రూ.5లక్షలలో ఇళ్లను కట్టలేం.

– నర్సయ్య, లబ్ధిదారుడు, గంగాసముందర్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ తుకారాం రాథోడ్

కమ్మర్‌పల్లి: వర్షాకాలం ప్రారంభమైనందున ప్రతి గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. గురువారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కీటక జనిత వ్యాధులు, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమలను నియంత్రించే కార్యక్రమాలను ప్రతి మంగళశారం, శుక్రవారం నిర్వహించి మలేరియా, డెంగీ నివారించాలన్నారు. కేజీబీవీలో కీటక జనిత వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ అధికారులు స్పందన, నరసింహస్వామి, హెచ్‌ఈవో సత్యనారాయణ, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్


సదస్సును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రెంజల్: భూభారతితో రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం నవీపేట్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా సందర్శించారు. రైతులు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. శుక్రవారం వరకు రైతులు తహసీల్ కార్యాలయాల్లో దరఖాస్తులను అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకట రమణ ఉన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

డొంకేశ్వర్: రెండు వారాల పాటు మండలంలో కొనసాగిన రెవెన్యూ సదస్సులు గురువారం ముగిశాయి. చివరి రోజు గంగాసముందర్‌లో సదస్సు నిర్వహించగా కేవలం నాలుగు దరఖాస్తులే వచ్చాయి. ఐతే, మొత్తం పన్నెండు గ్రామాలు కలిపి 328 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నరేశ్ కుమార్ తెలిపారు. డొంకేశ్వర్‌లో 30, అన్నారంలో 22, దత్తాపూర్‌లో 47, జీజీ నడ్కుడలో 30, గాదేపల్లిలో 11, కోమట్‌పల్లిలో 30, మారంపల్లిలో 23, నికాల్‌పూర్‌లో 66, నూత్‌పల్లిలో 6, సిర్పూర్‌లో 13, తొండాకూర్‌లో 46 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని కేటగిరీల వారీగా విభజించి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. శుక్రవారం కూడా భూ సమస్యలపై తహసీల్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుంటామని, ఆ తర్వాత తీసుకోబడవని తహసీల్దార్ స్పష్టం చేశారు.

జీపీ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

రుద్రూర్: జీపీ కార్మికుల రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని గురువారం కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. జీపీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు కార్మికుల వేతనాలు చెల్లించడంపై దృష్టి సారించాలని కోరారు.

కార్యక్రమంలో కార్మికులు శేఖర్, పోశెట్టి, లింగవ్వ, బ్రహ్మం, సాయవ్వ, లక్ష్మి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయానికి తరలివచ్చిన రైతులు


వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చిన రైతులు

వేల్పూర్ : భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించినప్పుడు ఆయా గ్రామాల్లో అందుబాటులో లేని రైతులు గురువారం వేల్పూర్ తహసీల్ కార్యాలయానికి తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన రైతులు, ఇతర పనుల నిమిత్తం వచ్చిన ప్రజలతో కార్యాలయం నిండిపోయింది. దీంతో అధికారులు క్యూలైన్లు ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. వేల్పూర్ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ఈనెల 13 వరకు కొనసాగాయి. సదస్సుల్లో తమ దరఖాస్తులు ఇవ్వలేకపోయిన రైతులు సోమవారం నుంచి కార్యాలయానికి లైనుకట్టారు. గురువారం రావాలని రైతులకు చెప్పడంతో తరలివచ్చారు. సాయంత్రంవరకు క్యూలో ఉండి దరఖాస్తులు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్: తెలంగాణ సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీని వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాజగంగారాం సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఫిజియోథెరపీ వైద్యురాలు రేణుక చిన్నారులకు చికిత్స అందించారు. శిబిరంలో ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ కిషన్, సురేశ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలి




డొంకేశ్వర్ : వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలని డొంకేశ్వర్ ఎంపీడీవో లక్ష్మి ప్రసాద్ జీపీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన దత్తాపూర్, నూత్‌పల్లి, గంగాసముందర్ గ్రామాల్లో పర్యటించారు. మొక్కలు పెంచుతున్న నర్సరీలను పరిశీలించారు. లక్ష్యానికి అనుగుణంగా జీపీల్లో ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. జీపీ కార్యదర్శి సాయిలు, మోహన్, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు ఉన్నారు.

ప్రైమరీ స్కూల్ తనిఖీ



డొంకేశ్వర్ : మండలంలోని నూత్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో రామకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదుల్లో తిరుగుతూ విద్యార్థుల హాజరు, నమోదును పరిశీలించారు. విద్యార్థులతో బోర్డుపై పేర్లు రాయించి చదవించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత



పెర్కిట్: ఆర్మూర్ మండలం పిప్రిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ సుర్బిర్యాల జీవన్‌రెడ్డి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కేపీ గంగారెడ్డి, జీ నరసారెడ్డి, కే రాములు, పీ సుమన్, జీ పద్మ, డీ ఎర్రవ్వ, సాయి రెడ్డి, భోజన్న, రాజ గంగారాం, గంగాధర్, అబ్బాస్ తదిరతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి భూ సేకరణ పూర్తి చేయాలి



రుద్రూర్: జాతీయ రహదారి నిర్మాణ పనులకు అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తిచేయలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పొతంగల్ మండల తహసీల్ కార్యాలయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల మండలంలో కోల్పోతున్న భూముల వివరాలు, సర్వే చేసి నివేదిక అందించాలన్నారు. ధరణి పెండింగ్ ఫైల్స్ గురించి ఆరా తీశారు. పెండింగ్ ఫైల్స్‌ను వెంటనే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బిల్లులు రాక.. పనులు పూర్తి కాక

- నుంకెట్, తిమ్మాపూర్ చిన్న వంతెనల వద్ద తారు పోయని కాంట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

మోర్తాడ్: మండలంలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో రెండు చోట్ల అసంపూర్తిగానే పనులు నిలిచిపోయాయి. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, సుంకెట్‌కు వెళ్లే మార్గంలో చిన్నగా ఉన్న కల్వర్టులతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వంతెనలను నిర్మించడానికి రూ.1.75 కోట్లు మంజూరు చేశారు. తిమ్మాపూర్ వద్ద వంతెనకు రూ.1 కోటి, సుంకెట్ మార్గంలో వంతెనకు రూ.75లక్షలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ పార్టీ నేతనే కాంట్రాక్టు పనులు దక్కించుకుని పనులు చేశారు. వంతెనను నిర్మించినా రెండు వైపులా రోడ్డును కలుపుతూ తారు పోయడం నిలిపివేశాడు. మట్టి పోసినా తారు వేయకపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో గుంతలు ఏర్పడి వాహనాలు దిగబడి పోతున్నాయి. సుంకెట్ వద్ద వంతెనకు ఒకవైపు కోత ఏర్పడింది. వాహనదారులు దీనిని గమనించకుండా వెళ్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. వంతెనలను నిర్మిస్తున్న సమయంలోనే బిల్లులను విడతల వారిగా చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో భారీ మొత్తంలో నిధులను విడుదల చేస్తూ ప్రొసిడింగ్‌లను ఇచ్చినా ఖజానాలో నిధులు లేకపోవడంతో బిల్లులు చెల్లించే పరిస్థితి కనిపించ లేదు. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉన్నా నిధుల కొరత తీవ్రంగా ఉంది. తనకు బిల్లులు వస్తేనే రోడ్డుపై తారు వేసి అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టరు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


వర్షపు నీటితో కోతకు గురైన వంతెన భాగం

క్లుప్తంగా

సర్కార్ బడిలో ప్రభుత్వ టీచర్ కొడుకు



వేల్పూర్: మండలంలోని మోతె గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పర్ల సాగర్ తన కుమారుడు పర్ల వరుణ్‌ను గురువారం స్థానిక హైస్కూలులో ఎంఈవో రేణుక సమక్షంలో చేర్పించారు. సాగర్ మెండోరా హైస్కూలులో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పాఠశాల విద్యా కమిషనర్ యోగితారాణా పిలుపు మేరకు, మోతె హైస్కూలు ప్రగతిని చూసి తన కుమారుడిని 8వ తరగతిలో చేర్పించారు. మోతె సాగర్‌ను, కుకునూర్‌లో తన పిల్లలను చేర్పించిన పతాని గంగాధర్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఎంఈవో కోరారు. హెచ్‌ఎం వైద్య గణేష్, నరసింహారావు, కృష్ణవేణి, గణేష్, మహేందర్, రత్నయ్య, శ్రావణశ్రీ, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీ సెంటర్ ప్రారంభం

డొంకేశ్వర్: నూతన మండలంగా ఏర్పడిన డొంకేశ్వర్‌లో మండల విద్యా వనరుల కేంద్రం (ఎమ్మార్సీ) ఏర్పాటైంది. దీనిని మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ గురువారం ప్రారంభించారు. ఎంఈవో కార్యాలయం ఇక నుంచి డొంకేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం ఎంఈవోను హెచ్‌ఎం సురేశ్, ఉపాధ్యాయులు సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్‌లో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్టీ సీనియర్ నాయకుడు జి పురుషోత్తం గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు టీఎస్ రెడ్డి, మాక్లూర్ విండో ఉపాధ్యక్షుడు గుండారం శేఖర్, మాజీ కార్పొరేటర్ రాయ్‌సింగ్, పుప్పాల లచ్చారెడ్డి, డానియల్, ఆకుల రవి, చిన్నయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

రుద్రూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం కంటి పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ టీచర్ వంజరి పద్మ, వైద్యులు జయప్రకాశ్, మల్లయ్య, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి ఫలితాల్లో 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు అంజయ్య నగదు ప్రోత్సాహాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వో వినోద, గంగాధర్, రాము, కనకయ్య, దినేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు వీడీసీ చేయూత

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలకు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ చేయూత అందించింది. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీడీసీ సభ్యులు కుర్చీలు అందించడంతో పాటు తాగు నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయించారు. వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, సభ్యులు బుచ్చిమల్లయ్య, సున్నం మోహన్, అధ్యాపకులు మధు, వెంకటేశ్, వైష్ణవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేడు పసుపు మొక్కల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానంలో శుక్రవారం పసుపు, అల్లం మొక్కలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ తెలిపారు. రైతులు మొక్కకు రూపాయి చొప్పున చెల్లించి తీసుకెళ్లాలని అన్నారు.

చేతులను శుభ్రంగా కడుక్కోవాలి

మాక్లూర్: చేతులను శుభ్రంగా కడిగిన తర్వాతే భోజనం చేయాలని కల్లెడి పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని చిన్నాపూర్, అడవి మామిడిపల్లి గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు రవీందర్, సుదర్శన్, ఏఎన్‌ఎం సుజాత, ఎస్ వీణ, సుమలత, ఆశ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

రుద్రూర్: కోటగిరి మండలం రాంపూర్‌కు చెందిన సాయినాథ్ అనే యువకుడు ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన స్థానిక యూత్, పొతంగల్‌కు చెందిన రమేశ్ అందించిన రూ. 48వేల నగదును గురువారం బాధితునికి అందజేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

బోధన్: సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్ కుమార్ తన కుమారుడు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. హెచ్‌ఎం దాసరి ధన్‌రాజ్, ఉపాధ్యాయులు కస్తూరి, హన్మాండ్లు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు


బాల్కొండలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


నందిపేటలో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్‌నాయకులు

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ పంచిపెట్టారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. నందిపేటలో నాయకులు రక్తదానం చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

- ముందస్తుగా కాలువల్లో చెత్తా చెదారం తొలగింపు

బోధన్‌టౌన్ : వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని బల్దియా అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గడిచిన వారం రోజుల నుంచి పట్టణంలోని వార్డుల్లో ఉన్న కుంటలు, ప్రధాన కాలువల్లో వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. రాకాసీపేట్ హనుమాన్ టేకిడి, శర్బతి కెనాల్, సరస్వతినగర్, ప్రగతినగర్ కాలనీల గుండా ప్రవహించే ప్రధాన కాలువలైన సాత్‌పూల్, నిజాంసాగర్ కాలువలను శుభ్రం చేయిస్తున్నారు. దీంతో పాటు ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గుంతలను పూడ్చి వేయిస్తున్నారు. మురికి కాలువల్లో చెత్త చెదారం నిల్వకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.


సాత్‌పూల్ కెనాల్‌ను పొక్లెయిన్‌తో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రగతికి కొత్త దిక్సూచి

- కొనసాగుతున్న వంద రోజుల కార్యాచరణ
- వార్డుల్లో ప్రత్యేక కార్యక్రమాలు


మురికాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పురపాలక పాలకవర్గం గడువు జనవరి 27న ముగిసిన నాటి నుంచి ప్రత్యేక పాలన అమలులోకి వచ్చింది. అదనపు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా ఉన్నారు. కాగా పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వేసింది. పట్టణ రూపురేఖలు మార్చే దిశగా వంద రోజుల ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతి అంశాన్ని సమగ్రంగా అమలు చేయాలన్న లక్ష్యంగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కళాప్రదర్శనలు, విద్యార్థులకు క్విజ్‌లు, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు.

కొనసాగుతున్న కార్యక్రమాలు

38 వార్డుల్లో రోజుకు రెండు వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పట్టణ వ్యాప్తంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే కార్యాచరణ చేపడుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. భువన్ యాప్ ద్వారా ఇంటింటి లెక్క తీసేందుకు సిబ్బంది సర్వేపై చేస్తున్నారు. శిథిల భవనాల తొలగింపు, రోడ్లపై గుంతల పూడిక, తాగు నీటి క్లోరినేషన్ వంటి చర్యలతో పట్టణాన్ని సుందరీకరంగా రూపకల్పనకు చేస్తున్నారు. రోజుకో కార్యక్రమంతో పురోగతి పథంలో ఈ వంద రోజుల ప్రణాళికలో ప్రభుత్వం ఆదేశించిన ప్రతి అంశంపై దృష్టి సారిస్తోంది.


మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్(ఫైల్)

ప్రణాళిక ప్రకారం ముందుకు



ప్రభుత్వం సూచించిన విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి విభాగానికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించాం. ప్రజలు ప్రత్యక్షంగా మార్పును గమనించేలా కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తున్నాం. వందరోజుల ప్రణాళికలో ప్రజలు కూడా సహకరించాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళిక


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 1, 16వ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ రాజు కొనసాగుతున్న పనులను గురువారం పరిశీలించారు. కాలనీవాసులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు అవినాశ్, యుగంధర్, బాజన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై అవగాహన

నందిపేట్: మండల కేంద్రంలోని టీఎస్ మోడల్ పాఠశాలలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి వాడ కం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలు, ఆరోగ్య సమస్యలను స్థానిక ఎస్సై చిరంజీవి వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

బోధన్‌టౌన్: పాత బోధన్ పట్టణంలో శుక్రవారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విషయాన్ని పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు.